
సాక్షి పల్నాడు

శనివారం ¦ 18 ¦ అక్టోబర్ ¦ 2025



సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 589 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 36,531 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 30,411 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 37,760 క్యూసెక్కులు వదులుతున్నారు.

రేపు అభయాంజనేయస్వామి వార్షికోత్సవం



ఫిరంగిపురం: వేమవరం అడ్డరోడ్డు సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయ 8వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. భక్తులకు గ్రామస్తుల సహకారంతో అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

న్యూస్‌రీల్

నెలాఖరులోగా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

నరసరావుపేట: నవంబరు మొదటి వారం నుంచి పత్తి కోతలు మొదలవుతున్నందున ఈనెలాఖరులోగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సీసీఐ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో సీసీఐ ప్రతినిధులు, జిల్లా అగ్రికల్చరల్ ట్రేడ్ మార్కెటింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతుల వెసులుబాటుకు కాపాస్ కిసాన్ మొబైల్ యాప్‌ను సీసీఐ ప్రవేశ పెట్టిందన్నారు. దీని ద్వారా ఎప్పటికప్పుడు పత్తి మద్దతు ధరలు, నాణ్యతా ప్రమాణాలు, యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఈ–పంట నమోదు వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి కేవీఎస్ ఉపేంద్రకుమార్, జిల్లా ఫైర్ అధికారి వి.హనుమంతరావు, సీసీఐ బయ్యర్లు, పోలీసు అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులు, పత్తి రైతులు పాల్గొన్నారు.

త్రికోటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.59 లక్షలు



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ. 59,97,254 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో డి.చంద్రశేఖర్ తెలిపారు. ఆలయంలో శుక్రవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. ఆలయంలో హుండీల ద్వారా రూ.55,76,935, అన్నదానం హుండీల ద్వారా రూ.4,20,319 లభించినట్లు వివరించారు. నగదుతోపాటు బంగారం 51.500 గ్రాములు, వెండి 330 గ్రాములు, విదేశీ కరెన్సీ 96 అమెరికన్ డాలర్లు, 140 కెనడా డాలర్లు, 100 యూఏఈ డాలర్లు లభించినట్లు తెలిపారు. హుండీ లెక్కింపును ఆలయ ఈవో డి చంద్రశేఖరరావు, దేవాదాయ శాఖ ఆభరణాల తనిఖీ అధికారి పి.సైదమ్మ భాయ్‌లు పర్యవేక్షించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ



యడ్లపాడు: ఎస్సీ, ఎస్టీ కేసును నరసరావుపేట డీఎస్పీ పి హనుమంతరావు శుక్రవారం విచారించారు. ఇటీవల యడ్లపాడు గ్రామంలోని విజయదుర్గ వైన్స్‌లో పనిచేస్తున్న యువకుడిపై దాడి జరిగిన ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ(పీవోఏ) కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రెండో దశ దర్యాప్తులో భాగంగా డీఎస్పీ యడ్లపాడు ఎస్ఐ టి శివరామకృష్ణతో కలసి వైన్స్ వద్దకు వెళ్లి స్వయంగా వివాదానికి సంబంధించిన అంశాలను రికార్డు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట రూరల్ సీఐ బి సుబ్బానాయుడు పాల్గొన్నారు.



నరసరావుపేటలో జిల్లా జేసీ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు



నరసరావుపేటలో ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



గురజాలలో ఆర్డీవో కార్యాలయ ఏఓ సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



సత్తెనపల్లిలో ఆర్డీవో రమణాకాంతరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

కలాలకు కళ్లెంపై నిరసన గళం

- సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి
- సాక్షి కార్యాలయాలపై పోలీస్ దాడులు దుర్మార్గం
- పత్రికా స్వేచ్ఛ అణిచివేతపై ప్రజా, జర్నలిస్ట్ సంఘాల మండిపాటు
- నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల, వినుకొండలలో నిరసనలు

ప్రజాగొంతుకై కూటమి అక్రమాలను ప్రశ్నిస్తున్న 'సాక్షి'పై ప్రభుత్వం కక్ష కట్టింది. సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, ఇతర సిబ్బందిని నోటీసులు, కేసుల పేరిట వేధించసాగింది. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పత్రికా స్వేచ్ఛను హరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. కూటమి కక్ష సాధింపు చర్యలపై జర్నలిస్టులు శుక్రవారం కన్నెర్ర చేశారు. జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల, వినుకొండలలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలంటూ నినదించారు. ప్రజల తరఫున మాట్లాడితే వేధిస్తారా అంటూ నిలదీశారు. నిరసన కార్యక్రమాల్లో పాత్రికేయులు, ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై అక్రమ కేసులు, వేధింపులు ఆపాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, పాత్రికేయులకు ఇచ్చిన నోటీసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు.

నరసరావుపేట: రాష్ట్రంలో కలం పట్టుకున్న పాత్రికేయులపై కూటమి ప్రభుత్వం కత్తి వేలాడదీసి బెదిరిస్తుందని, పత్రికా స్వేచ్ఛని హరిస్తుందని జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, ఇతర రిపోర్టర్లపై పెట్టిన అక్రమ కేసులు, వేధింపులకు నిరసనగా శుక్రవారం పల్నాడు జిల్లా ప్రెస్‌క్లబ్, నరసరావుపేట, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఏపీడబ్ల్యూజేయూ), యూ ట్యూబర్స్ అసోసియేషన్, ప్రజాసంఘాలు, సోషలిస్టులు, వామపక్ష నాయకులు కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని అంటూ నినాదాలు చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేలకు అక్రమ కేసులను ఎత్తేయాలని, వేధింపులు ఆపాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. సోషల్ యాక్టివిస్టు, నైతిక విప్లవం పత్రిక మాజీ సంపాదకులు ఈదర గోపీచంద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అక్రమాలపై కథనాలు రాస్తున్న సాక్షి పత్రికపై అక్రమ కేసులు పెట్టి పత్రికా స్వాతంత్ర్యాన్ని ప్రమాదంలో పడేసిందన్నారు. అడ్డగోలుగా ప్రజలకు అబద్ధాలు చెబుతూ ప్రభుత్వాన్ని చంద్రబాబు నడిపిస్తున్నాడన్నారు. ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారనే కారణంతో సాక్షి ప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టి వేధించటం దారుణమని ఏపీడబ్ల్యూజేయూ జిల్లా గౌరవ అధ్యక్షులు నంద్యాల జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు చేస్తున్న అవినీతి, అక్రమాలను ఏరోజుకారోజు ప్రజలకు తెలియచేస్తున్నందుకే ఆ పత్రికపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, ఇటువంటివి కూటమి నేతలు వెంటనే మానుకోవాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు అన్నారు. నిజం రాసే సాక్షి పత్రికపై కేసులు, సోషల్ మీడియా పోస్టులపై కేసులు పెట్టవద్దని సుప్రీం కోర్టు చెబుతున్నా కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధించటం దారుణమని ఎంఐఎం పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి చెప్పారు. సీపీఐ సీనియర్ నాయకుడు ఉప్పలపాటి రంగయ్య మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. సాక్షి స్టాఫ్ రిపోర్టర్ ఆర్.లవకుమార్‌రెడ్డి, పల్నాడు జిల్లా ప్రెస్‌క్లబ్, నరసరావుపేట అధ్యక్షులు సీహెచ్.వి.రమణారెడ్డి, ఏపీడబ్ల్యూజేయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, సాక్షి టీవీ రిపోర్టర్ సుంకిరెడ్డి, రిపోర్టర్లు పి.కోటిరెడ్డి, జీవీ సాంబశివారెడ్డి, ఆలీ, శివ, పచ్చవ బుజ్జి, అప్పారావు, షాహీద్, బాదుగున్నల శ్రీనివాసరావు, పున్నారావులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వస్తున్న జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు

సత్తెనపల్లిలో...

ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రమాదంలో పడేలా పాలకుల వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ సత్తెనపల్లిలోని జర్నలిస్టులు ఐక్యంగా శుక్రవారం సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి జీవీ.రమణాకాంతరెడ్డికి వినతి పత్రం అందించారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట నినదించి మీడియాతో మాట్లాటారు. కొంతకాలంగా సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, సాక్షి జర్నలిస్టులను పోలీసులు పదేపదే విచారిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇలాంటి చర్యలు సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేయూ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ సైదా, సాక్షి సత్తెనపల్లి ఆర్సీ ఇన్‌చార్జి విప్పర్ల శ్రీనివాసరావు, జర్నలిస్టులు మారూరి లింగారెడ్డి, షేక్ జిలాని, షేక్ బాజీ, మునగా వెంకటేశ్వరరావు, అంకాళ్ల నాగరాజు, అడబాల.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గురజాలలో...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పత్రికా స్వేచ్ఛ లేకుండా అణగదొక్కాలనే లక్ష్యంతో ఉన్నారని సాక్షి మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంఎస్ నాగేశ్వరరావు అన్నారు. రెవెన్యూ డివిజన్ కేంద్రం గురజాలలో శుక్రవారం సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి, ఇతర రిపోర్టర్లపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడంతోపాటు వారిని బెదిరింపులకు గురిచేయడంపై అందుకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. విలేకరులపై అక్రమ కేసులు, వారిని భయాందోళనకు గురిచేయడం వంటి వాటిని మానుకోవాలన్నారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయం అధికారి కె సుజాతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రిపోర్టర్లు వినుకొండ అజయ్‌కుమార్, రామారావు, పాపారావు, వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్ రహీం, రాజారత్నారెడ్డి, మల్లికార్జునరెడ్డి, కేతిరెడ్డి బాలకృష్ణారెడ్డి తదితరులున్నారు.

వినుకొండలో...

సాక్షి పత్రిక సంపాదకులు ఆర్.ధనంజయరెడ్డి, రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి విలేకరులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని వినుకొండ పట్టణంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలియజేశారు. డిప్యూటీ తహసీల్దార్ మురళికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్‌లు పాల్గొన్నారు.

మహిళా, శిశు సంక్షేమశాఖ సక్రమంగా పనిచేయాలి

జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట: జిల్లాలోని మహిళా, శిశు సంక్షేమ శాఖను సక్రమంగా పనిచేసేలా చూడాలని, అవసరాన్ని బట్టి పిల్లలు, గర్భిణులు, బాలింతలకు రోజువారి కార్యక్రమాలు సక్రమంగా ప్రభుత్వ నిర్దేశిత ప్రకారం జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో శాఖాపరమైన సమీక్ష సమావేశం నిర్వహించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ పనితీరు మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రోజు వారి విధులు ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని, ముఖ్యంగా యుక్త వయస్సు, గర్భిణులు, బాల్యవివాహాలు సమస్యలు జిల్లాలో ఎక్కువగా ఉన్నందున వాటిని తగ్గించేందుకు పనిచేయాలన్నారు. పోషణకు దూరమైన పిల్లల్ని గుర్తించి వారి గృహ సందర్శన ద్వారా సరైన పోషకాహారం ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రీ స్కూల్ హాజరు పెంచాలని, జిల్లాలోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని జిల్లాలోని సీడీపీఓలు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. జిల్లా సాధికారత అధికారిని ఎం.ఉమాదేవి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓలు కాంతకుమారి, శ్రీలత, శాంతకుమారి, అపరంజి, జ్యోత్స్న, వెంకటరమణ, రాజేశ్వరి, బాల సంక్షేమ సమితి కార్యాలయ సభ్యులు సారిరాజు, వన్‌స్టాప్ సెంటర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, వేదికపై ఉమాదేవి

జిల్లాలో ఆర్టీసీ సేవలు మెరుగు పర్చాలి

జిల్లాలో ఆర్టీసీ సేవలు మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆర్టీసీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉన్న పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులపై మహిళలకు ఉచితం అని స్పష్టంగా కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో సౌమ్యంగా ప్రవర్తించేలా కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. సమయపాలనతో బస్సులు నడపాలన్నారు. జిల్లాలోని పలు జెడ్పీ పాఠశాలలు, జూనియర్ కళాశాలకు మారిన టైమింగ్స్ ప్రకారం బస్సులు నడపాలన్నారు. బస్టాండ్లలో తాగునీరు, టాయిలెట్లు వసతులు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అజితకుమారి, డీఈవో చంద్రకళ, పలు డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ చేసి పేదల కడుపు కొట్టొద్దు

రచ్చబండలో గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు

మాచవరం: వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో పేదలకు మెరుగైన వైద్య సేవలు, పేద విద్యార్థులకు తక్కువ ఖర్చుతో వైద్య విద్యను అందించేందుకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పిడుగురాళ్ల మండలంలోని కామేపల్లి సమీపంలో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం చేపడితే కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తుందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగేశ్వరరావు తండా, శ్రీ రుక్మిణి పురం గ్రామాల్లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా రచ్చబండ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అతి తక్కువ ఫీజుతో పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించే అవకాశాన్ని జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తే చంద్రబాబు విధానాల వల్ల రూ.30 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇది పేదలకు సాధ్యమా అని ప్రశ్నించారు. పార్టీలకతీతంగా అందరూ ఆలోచించి విద్యార్థుల భవిష్యత్తు కోసం సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ప్రజల అండదండలతో పోరాడి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అడ్డుకొని తీరుతామన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలను, విధానాలను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధితోపాటు తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి స్వయంపాలన అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దు ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు శివయాదవ్, మండలం అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి చల్లా పిచ్చిరెడ్డి, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు గుర్రం గురవారెడ్డి, జిల్లా కార్యదర్శి జిలుగు నరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షులు సిద్దారెడ్డి పుల్లారెడ్డి, గుమ్మ హుస్సేనయ్య, మండల యూత్ కన్వీనర్ ముండ్లపాటి చిన ఆంజనేయులు, మండల నాయకులు అంబటి కోటయ్య, అనిల్‌కుమార్, వంకాయల రమేష్, మహమ్మద్ జానీ, రాము, బ్రహ్మారెడ్డి, పెరుగు రోశయ్య, గ్రామ సర్పంచులు రామారావు, అనంగి వెంకటేశ్వర్లు, బత్తుల కృష్ణ, బాలాజీనాయక్, బాబురావు నాయక్, ఎంపీటీసీ సభ్యులు శ్రీశైలం నాయక్, గురవయ్య, సోషల్ మీడియా టీం సభ్యులు జక్కుల కొండలు, బాబు, రాజు, చిన్న అంజి, తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **1,500** గరిష్టం : రూ. **2,200**

మోడల్ ధర రూ. **1,800**

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	37,368
అమ్మకాలు	42,710
నిల్వ	6,578

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-15,000
నంబరు-5	10,000-14,500
273	10,500-13,800
341	10,000-15,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-15,000
నంబరు-5	10,000-14,800
341	10,000-15,800
4884	10,000-14,000
సూపర్-10	10,000-14,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,300
బాడిగ-355	10,500 - 15,600
దేవనూరు డీలక్స్	10,000 - 14,700
ఆర్మూర్	10,000 - 12,600
తాలుకాయలు	5,500 - 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-15,000
బాడిగ - 355	10,000-15,200
దేవనూరు డీలక్స్	10,500-14,800
తాలు	5,300 - 8,000

-కొరిటెపాడు (గుంటూరు)

గూగుల్ డేటా సెంటర్‌తో ఒరిగేదేం లేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నరసరావుపేట ఈస్ట్: విశాఖలో ఏర్పాటు చేస్తున్న గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు వలన రాష్ట్రానికి ఒనగూరే ప్రయోజనం శూన్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ట్రంప్ టారిఫ్ ఉగ్రవాదం, అమెరికా ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. సదస్సులో శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాల వల్ల భారతీయ విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిపై ప్రధాని మోదీ చీకటి ఒప్పందాలకు తెరతీస్తున్నారని పేర్కొన్నారు. మోడీ వ్యవహార శైలితో దేశంలో ఆయిల్ సంక్షోభం తలెత్తటంతోపాటు దేశ సార్వభౌమత్వమే ప్రమాదంలో పడే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ఐటీ హీరోని నేనే అని ప్రగల్భాలు పలికే సీఎం చంద్రబాబు అమెరికాలో మన విద్యార్థులు పడుతున్న బాధల పట్ల కనీస సానుభూతి ప్రకటించటం లేదని అన్నారు. విదేశీ కంపెనీ గూగుల్‌కు రూ.22 వేల కోట్లు రాయితీ ఇస్తున్నారని, దీనివల్ల రాష్ట్రానికి ఒరిగే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. గూగుల్ మన వద్ద రాయితీ తీసుకొని ప్రపంచమంతా వ్యాపారం చేసుకుంటూ లాభ పడుతుందన్నారు. గూగుల్ డేటా సెంటర్‌లో రెండు లేదా మూడు వందల మందికి మించి ఉద్యోగాలు రావన్నారు. గూగుల్‌కు ఇచ్చే రాయితీలతో రాష్ట్రంలో ఎన్నో మెడికల్ కళాశాలలను నిర్మించవచ్చన్నారు. ప్రధాని మోదీ రాష్ట్రంలో చేసిన పర్యటనలకు దాదాపు రూ.1500 కోట్లు ఖర్చు చేశారని, కానీ రాష్ట్రానికి ఒక్క పైసా ప్రయోజనం లేదన్నారు. ప్రధాని మోదీ పర్యటనలకు వందల కోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను విస్మరించటం దారుణమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ పర్యటన ఆసాంతం పొగడ్తలకే సరిపోయిందన్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించేందుకు తమ పార్టీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్టు స్పష్టం చేశారు.

టీడీపీ నాయకురాలి కుటుంబసభ్యులు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న మురుగుడు, వేమారెడ్డి

మంగళగిరి టౌన్: మంత్రి లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని టీడీపీ శ్రేణులు షాక్‌కు గురయ్యాయి. టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీదేవి కుటుంబంలోని కొందరు వైఎస్సార్‌సీపీలో చేరడమే దీనికి కారణం. తొలుత పాత మంగళగిరి సీతారామ కోవెల సెంటర్ నుంచి ఆత్మకూరు నియోజకవర్గ కార్యాలయం వరకు సుమారు వందమందికిపైగా యువతతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంగళగిరి వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్ ఆధ్వర్యంలో శుక్రవారం జానకీదేవి తోటికోడలు అయిన తమ్మిశెట్టి అనూరాధతోపాటు జితేంద్ర, గౌతమి, బిట్ర శ్వేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలోకి వారిని సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిలు పార్టీ కండువాలు కప్పి, అభినందించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించడంతో పోరాటం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై నమ్మకంతో పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. పార్టీపై, అధినాయకుడిపై నమ్మకం ఉంచి పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని మురుగుడు, డీవీఆర్‌లు సూచించారు. జానకీదేవి ప్రస్తుతం టీటీడీ బోర్డు మెంబరుగా ఉన్నారు. మొదటి నుంచి బీజేపీ నేపథ్యం ఉన్న ఆమె 2004లో మంగళగిరి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరి మళ్లీ పోటీ చేసినా ఓడిపోయారు. 2024 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు.

వైఎస్సార్‌సీపీలో పలువురు జిల్లా వాసులకు పదవులు

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన పలువురు నాయకులను వివిధ హోదాల్లో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆర్గనైజేషనల్ సెక్రటరీలుగా నరసరావుపేటకు చెందిన గెల్లి బ్రహ్మారెడ్డి, యన్నం రాధాకృష్ణారెడ్డి, గురజాలకు చెందిన కలకంధ అంద్రయ్యను యాక్టివిటీ సెక్రటరీగా నియమితులయ్యారు. నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షులుగా కంద్రకుంట మరియమ్మను నియమించారు.

28న చేనేత కార్మికుల ధర్నా

మంగళగిరి టౌన్: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 28వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఏడీ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పి నేటికీ అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. సహకార సంఘాలకు రావాల్సిన బకాయిలు రూ.203 కోట్లను ప్రభుత్వం విడుదల చేయకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చేనేత రక్షణకు 11 రకాల రిజర్వేషన్లు అమలు జరపాలని కోరా రు. చేనేతపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేయాలన్నా రు. చేనేత కార్మికులకు, సహకార సంఘాల్లో లేని వారికి ఇవ్వాల్సిన త్రిఫ్ట్ ఫండ్ రూ.27 కోట్లను కూడా విడుదల చేయాలని కోరారు.

కబడ్డీ టోర్నీలో క్రీడాకారిణుల ప్రతిభ



గుంటూరురూరల్: నగర శివారు లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల కబడ్డీ టోర్నమెంట్ రెండో రోజు శుక్రవారం పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. వివిధ కళాశాలల జట్లు ప్రతిభ చాటాయి. నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల, తెనాలి జె.ఎం.జె. డిగ్రీ కళాశాల, గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ అండ్ సైన్స్ విభాగం, గుంటూరు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలు తొలి నాలుగు స్థానాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. విజేతలను చైర్మన్ అభినందించారు.

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

- డీఈవో చంద్రకళ
- ఘనంగా జిల్లా సైన్స్ సెమినార్



బహుమతులు సాధించిన విద్యార్థులతో డీఈవో చంద్రకళ

నరసరావుపేటరూరల్: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 30 నమూనాలను విద్యార్థులు పోటీలో ప్రదర్శనకు ఉంచారు. కాకాని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వక్కలగడ్డ కాత్యాయనీ ప్రథమ స్థానం, నరసరావుపేట మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన కోడిరెక్క ఇమ్మానియేల్‌కు ద్వితీయ స్థానం లభించింది. ఈ రెండు నమూనాలను శనివారం విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేశారు. రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌లో జిల్లా విద్యార్థులు మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని డీఈవో తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో ఎస్‌కె సుభాని, సత్తెనపల్లి డీఈవో ఏసుబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి, జిల్లా సైన్స్ అధికారి ఎస్.రాజశేఖర్, ఉపాధ్యాయులు రఘురాం, చింత శ్రీనివాసరెడ్డి, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్‌లో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం



బస్‌షెల్టర్‌లో ఉన్న మృతదేహం

సత్తెనపల్లి: సత్తెనపల్లి మండలం కంటెపూడిలోని బస్సు షెల్టర్‌లో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం శుక్రవారం వెలుగు చూసింది. స్థానికుల సమాచారం మేరకు సత్తెనపల్లి రూరల్ ట్రైనీ ఎస్‌ఐ ఆర్.వెంకటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని సందర్శించి వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయసుగల వృద్ధుడు తెల్ల చొక్కా, ఫ్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు సత్తెనపల్లి రూరల్ సీఐ 9440796231, 9490571949 నంబర్లకు తెలియజేయాలన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

తెనాలి రూరల్: తెనాలిలో పట్టపగలు నడిరోడ్డుపై ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటనలో నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ బి.జనార్దనరావు కేసు వివరాలను వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల మేరకు... బాపట్ల జిల్లా అమృతలూరు మండలం కోరుతాడిపర్రు గ్రామానికి చెందిన జూటూరి తిరుపతిరావు(60) ఈ నెల 14న పట్టణంలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. తిరుపతిరావు గ్రామంలోని రామాలయం పాలకవర్గంలో కీలకంగా ఉన్నాడు. ఆలయ చెరువుల వేలం పాటల నిర్వహణ బాధ్యత చూసేవాడు. 15 రోజుల క్రితం జ్వరం రావడంతో తిరుపతిరావు తన భార్యతో కలసి తెనాలిలో నివాసం ఉంటున్న కుమార్తె గండికోట దుర్గ ఇంటికి వచ్చాడు. ఈ నెల 14న టిఫిన్ కోసం బైక్‌పై ఇంటి నుంచి బయటకు వచ్చాడు. సమీపంలో టిఫిన్ సెంటర్ వద్ద బైక్‌పై కూర్చున్నాడు. అదే సమయంలో కోరుతాడిపర్రు గ్రామానికి చెందిన గండికోట వెంకటసుబ్బారావు వచ్చి కొబ్బరి బొండాల కత్తితో విచక్షణరహితంగా దాడి చేసి పారిపోయాడు. తిరుపతిరావుతో నిందితుడికి కొంతకాలంగా విభేదాలున్నాయి. నిందితుడి వ్యక్తిగత విషయాలలోనూ తిరుపతిరావు జోక్యం చేసుకున్న కారణంగా కక్ష పెంచుకొని ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఆలయ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించడం, గతంలో తన తండ్రి మృతికి కూడా తిరుపతిరావు కారణమయ్యాడని భావించి రెక్కీ నిర్వహించి మరీ హత్యకు పాల్పడ్డాడు. నిందితుడిపై పట్టణ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గతంలో మూడు కేసులు, అమృతలూరు పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదైనట్లు వెల్లడించారు. తిరుపతిరావు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కంచర్లపాలెం రోడ్డులో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. సమావేశంలో సీఐ ఎస్. సాంబశివరావు, త్రీ టౌన్ ఎస్‌ఐ కరిముల్లా, రూరల్ ఎస్‌ఐ కె. ఆనంద్, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

స్వదేశీ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్



గుంటూరు మెడికల్: స్వదేశీ ఉద్యమాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ ఏపీ అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. శుక్రవారం మంగళగిరి హాయ్‌లాండ్‌లో బీజేపీ అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులకు కార్యశాల జరిగింది. పీవీఎన్.మాధవ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్‌డీ విల్సన్, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయ ప్రకాష్, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్, బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ కింద కార్పొరేట్ ఆస్పత్రులలో వైద్యం అందిస్తున్నామన్నారు. మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెస్తే ప్రజలకు మంచి జరుగుతుందన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

కర్లపాలెం: క్రీడాకారులు సమయస్ఫూర్తితో ఆడి విజయం సాధించాలని డీఈవో పురుషోత్తం తెలిపారు. మండలంలోని యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాపట్ల డివిజన్ స్థాయిలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈవో పురుషోత్తం ముందుగా వాలీబాల్ క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపే ధ్యేయంగా ఆడాలని సూచించారు. నిష్పక్షపాతంగా పోటీలు నిర్వహించాలని వ్యాయామ ఉపాధ్యాయులకు చెప్పారు. పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచిన వారిని డివిజన్ స్థాయి టీమ్‌కు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుగుణ మణి, వ్యాయామ ఉపాధ్యాయురాలు మెర్సీ, ఎంఈవోలు మనోరంజని, విజయశ్రీ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మాజీ కార్యదర్శి కరిముల్లా, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతిమ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న 40 టీములు

బాపట్ల డివిజన్ పరిధిలోని మొత్తం 12 మండలాల నుంచి అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాలలో మొత్తం 40 టీమ్‌లు పాల్గొన్నాయి.

- అండర్-14 బాలుర విభాగంలో కర్లపాలెం టీమ్ విజేత కాగా బాపట్ల టీమ్ రన్నరప్‌గా నిలిచింది.
- బాలికల విభాగంలో పిట్టలవానిపాలెం టీమ్ విజయం సాధించగా, భట్టిప్రోలు టీమ్ రన్నరప్‌గా నిలిచింది.
- అండర్-17 బాలుర విభాగంలో బాపట్ల టీమ్ విజయం సాధించగా పిట్టలవానిపాలెం టీమ్ రన్నరప్‌గా నిలిచింది.
- బాలికల విభాగంలో పిట్టలవానిపాలెం టీమ్ విజయం సాధించగా బాపట్ల టీమ్ రన్నరప్‌గా నిలిచింది.



యాజలి ఉన్నత పాఠశాలలో వాలీబాల్ క్రీడాకారులతో డీఈవో పురుషోత్తం, వ్యాయామ ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి షూటింగ్ పోటీలకు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): సౌత్ జోన్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ద ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ షూటర్లు 20 మంది రైఫిల్, పిస్టల్ విభాగాలలో ప్రతిభ కనబరిచారని అకాడమీ చీఫ్ కోచ్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 11వ తేదీ నుంచి జరిగే జాతీయ పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. రైఫిల్ విభాగంలో వట్టిమల్లీ షణ్ముఖ రుష్యేంద్ర, శ్రీరంగ సాయి చరణ్, పారా ఆశ్రిత్ చౌదరి, వజ్జు దారియా, ఎం. కార్తికేయన్, దాసరి సౌమ్యశ్రీ, చిన్ను తేజస్, కాగిత విద్యావల్లి, కాగిత కుసుమవల్లి, కె.ఎస్.ఎస్ చక్రవర్తి, మట్లి యోక్షిత్ రెడ్డి, షేక్ హబీబా సుహానా, అన్నా బత్తిని రోహిత్ ఎంపికయ్యారని తెలిపారు. పిస్టల్ విభాగంలో కొసన పూర్ణిమ, సోడిశెట్టి ధరణీనాథ్, రాజ రాజేశ్వరి, ఒంటెద్దు నాగ లోహిత్ రెడ్డి, గ్రీష్మ సందేశ్, అభిలాష్ చంద్ర, రిషిక్ బాబులు అర్హత సాధించారన్నారు. వీరిని రాష్ సెక్రెటరీ డి. రాజ్ కుమార్ తదితరులు అభినందించారన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో


- హస్తకళల డిజైనర్ మృతి
- హాస్టల్ వార్డెన్‌కు తీవ్ర గాయాలు



మృతి చెందిన ఎస్.సుగుణరాజు

మాచర్ల రూరల్/ విజయపురిసౌత్: ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న హస్తకళల డిజైనర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మాచర్ల మండలం తాళ్లపల్లి కుడి కాలువ సమీపంలోని మాచర్ల-సాగర్ ప్రధాన రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కొత్తూరులోని హస్తకళల వారికి శిక్షణ ఇచ్చేందుకు వచ్చిన ట్రైనర్‌లు ఎస్.సుగుణరాజు, ఫిలిప్, వంగడ రమేష్ కొత్తూరు నుంచి పోచం నర్సింహారావు అనే వృద్ధుడు ఆటోలో మాచర్ల బయలుదేరారు. ఏడో మైలులోని గిరిజన ఆశ్రమ పాఠశాల వార్డెన్ నాగ మల్లీశ్వరి, మరో వ్యక్తి కూడా ఆటో ఎక్కారు. తాళ్లపల్లి సమీపంలోకి రాగానే రోడ్డుపై నిలిచి ఉన్న లారీని ఆటో ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న హస్తకళ ట్రైనర్ ఎస్.సుగుణరాజు (35) అక్కడికక్కడే మృతి చెందాడు. వార్డెన్ నాగ మల్లీశ్వరికి, ట్రైనర్ ఫిలిప్‌కు తీవ్ర గాయాలుకాగా వంగడ రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు సుగుణరాజుకు వివాహం కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్‌ఐ అశోక్ తెలిపారు.

విలువలతో కూడిన నాయకత్వం అవసరం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి

చేబ్రోలు: విద్య కేవలం జ్ఞాన సంపాదనకే కాకుండా విలువల తో కూడిన నాయకత్వం పెంచుకోవడానికి కూడా ముఖ్యమని ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ హానరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధాకర్‌రెడ్డి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో 'కల్టివేటింగ్ ఎథికల్ బిజినెస్ లీడర్స్'పై రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఉస్మానియా వర్సిటీ మాజీ డీన్ ప్రొఫెసర్ ఎ. సూర్యనారాయణ మాట్లాడుతూ ఆధునిక సంస్థల్లో ఎదురయ్యే నైతిక సమస్యలను ఆచరణాత్మక కోణంలో విశ్లేషించారు. పుదుచ్చేరి యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ స్కూల్‌కు చెందిన ప్రొఫెసర్ యార్లగడ్డ శ్రీనివాసులు భారతీయ తత్వశాస్త్ర సంప్రదాయాల ప్రాధాన్యతను నైతిక నాయకత్వ అభివృద్ధితో అనుసంధానించి వివరించారు. ఐఐటీ హైదరాబాద్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎం.పి.గణేష్ ఆధునిక అభివృద్ధి తత్వాలతోపాటు ప్రాచీన భారతీయ జ్ఞానాన్ని సమన్వయం చేయడం ఎంత అవసరమో వెల్లడించారు. వంద మందికిపైగా ప్రతినిధులు తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, డీన్లు పాల్గొన్నారు.

చలో.. సూర్యలంక !

కార్తిక మాసం అనగానే మనుష్యుల మధ్య ఐకమత్యం, ప్రకృతితో మనిషికి గల అవినాభావ సంబంధాన్ని తెలిపే వన భోజనాలు గుర్తు కొస్తాయి. పచ్చ పచ్చని వనాల్లో సేద తీరడంతో భవిష్యత్‌పై ఆశలు పుడతాయి. సమష్టి తత్వం బోధ పడుతుంది. దైనందిన జీవితంలో ఆశ, నిరాశలు, ఒత్తిడి, బాధ్యతల బరువుతో సతమతమయ్యే మనిషికి కార్తిక మాసంలో చేసే వన భోజనాలు ఆటవిడుపుగా ఉంటాయి.

- 22నుంచి కార్తిక మాసం ప్రారంభం
- ఆహ్లాదకరం సూర్యలంక తీరం
- వన భోజనాలకు జీడిమామిడి తోటలు అనువు
- హరితా రిసార్ట్స్‌లో రూముల సౌకర్యం

బాపట్ల: కార్తిక మాసం వచ్చిందంటే చాలు అందరి కళ్లు జిల్లాలోని సూర్యలంక తీరం పైనే ఉంటాయి. ఈ నెల 22 నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుంది. రాష్ట్రంలోనే సహజసిద్ధమైన తీరంగా పేరున్న సూర్యలంకకు కార్తిక మాసంలో పర్యాటకులు, భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. సముద్ర స్నానాలు చేసి, తీరానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఫారెస్ట్ భూమిలో ఉన్న జీడిమామిడి తోటలో వన భోజనాలు చేస్తారు. వననర్సరీ చాలా అనువుగా ఉంటుంది. స్నానాల నంతరం పూజలు చేసుకునేందుకు వీలుగా తీరం వెంబడే ఆంజనేయస్వామి దేవాలయం ఉంది.



సూర్యలంక తీరం (ఫైల్)

చేరుకునేది ఇలా...

బాపట్ల నుంచి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్యలంక సముద్ర తీరానికి వెళ్లేవారు ముందుగా పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్దకు చేరుకోవాలి. అక్కడి నుంచి ఆటో సర్వీసులు అందుబాటులో ఉంటాయి. బాపట్ల నుంచి నేరుగా సూర్యలంక వరకు వెళ్తుంటాయి. ఒక్కో మనిషికి రూ.20 చార్జీ ఉంటుంది. సర్వీసులు ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. కార్తిక మాసంలో వచ్చే ప్రతి ఆది, సోమవారాల రోజున బాపట్ల నుంచి ఆర్టీసీ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. రైలు మార్గాన వచ్చే వాళ్లకు స్థానిక రైల్వేస్టేషన్ నుంచి నేరుగా సూర్యలంకకు, బస్సు మార్గాన వచ్చే వాళ్లకు బాపట్ల పాత బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఇతర జిల్లాల నుంచి వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం గుంటూరు బస్ స్టేషన్ నుంచి కూడా నేరుగా బస్సులు అందుబాటులో ఉంటాయి.



తీరం ఒడ్డున హరితా రిసార్ట్స్

రిసార్ట్స్‌లో వసతి సౌకర్యం

సహజ సిద్ధమైన సూర్యలంక తీరంలో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు, పర్యాటకులు సేదతీరేందుకు వీలుగా తీరం ఒడ్డున హరితా రిసార్ట్స్ ఉన్నాయి. ఇందులో 25 ఏసీ రూమ్‌లు, రెండు నాన్ ఏసీ రూమ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఆన్‌లైన్‌లో aptdc. gov. in అనే వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. పర్యాటకుల సౌకర్యార్థం తీరం వెంబడి రెస్టారెంట్, గ్రూపు యాత్రికుల కోసం క్యాటరింగ్ సౌకర్యం, టూరిస్టు బోటు , తీరం వెంబడే జిమ్ సెంటర్‌ను కూడా నిర్వహిస్తున్నారు.